క్లుప్తంగా

నేడు మారెమ్మ, దురుగమ్మ ఉత్సవాలు

గుమ్మఘట్ట: మండలంలోని గలగల, గొల్లపల్లి, కె.పి.కుంట గ్రామాల్లో మారెమ్మ, దురుగమ్మ దేవతల ఉత్సవాలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామపెద్దలు తెలిపారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను జలధికి తీసుకెళ్లి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామాల్లో మేళతాళాలు, డప్పులు, ఊరాల నడుమ ఊరేగిస్తామన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి



బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండలో గడప గడపకూ మన ప్రభుత్వం కింద మంజూరైన నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని సర్పంచ్ నాగమ్మ , వైఎస్సార్ సీపీ నాయకులు రామ్మోహన్, నరేష్,వన్నూరప్ప, క్రిష్టప్ప సోమవారం తెలిపారు. బీసీ కాలనీలో రూ.4 లక్షలతో సిమెంట్ రోడ్డు, ఎస్సీ కాలనీలో రూ.2 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం పూర్తయిందన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా పర్యటించినపుడు ప్రజల వినతికి ఆయన స్పందించి నిధులు కేటాయించారన్నారు. డ్రైనేజీ, సిమెంట్ రోడ్డు ఏర్పాటు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



మారెమ్మ ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు, గ్రామస్తులు

ఉరవకొండ: మండలంలోని బూదగవిలో గౌరసంద్ర బూదగవి మారెమ్మదేవి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారి ఉత్సవ మూర్తిని భారీ ఊరేగింపు చేపట్టారు. ఆలయం నుంచి గాంధీచౌక్ మీదుగా పట్టణంలో అమ్మవారి ఉత్సవ మూర్తులతో పాటు గంగాజలాన్ని ఊరేగించారు. అనంతరం గంగాజలాన్ని ఆలయం వద్దకు తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ ప్రవీణ్‌కుమార్

ఉరవకొండ: రూరల్ సీఐగా ప్రవీణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతిలో వీఆర్‌లో ఉంటూ ఎస్ఐ నుంచి సీఐగా పదోన్నతిపై పొంది బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కూడేరు, బెళుగుప్ప ఎస్ఐలు సత్యనారాయణ, రామకృష్ణ స్వాగతం పలికారు. సీఐ మాట్లాడుతూ ఉరవకొండ రూరల్ సర్కిల్ పరిధిలోని వజ్రకరూర్, కూడేరు, బెళుగుప్ప, విడపనకల్లు, పాల్తూరు పోలీస్ స్టేషన్‌ల పరిధిలో అసాంఘిక కార్యాలపాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారులు సోమవారం ఇంటింటికీ వెళ్లి దోమల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని మెడికల్ ఆఫీసర్ అరుణకుమారి, మలేరియా విభాగం అధికారి కోదండరామిరెడ్డి సూచించారు. కార్యక్రమంలో సర్పంచు బీమ్లారాణి, ఎంపీటీసీ దాసరి వెంకటేశులు, పాటిల్ శివగౌడు, బోయ మహాలింగ ,హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, యశోద, పీహెచ్ఎన్ నాగమ్మ, సచివాలయ ఏఎన్ఎం శ్రావణి,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆజాదీకా అమృత్ మహోత్సవం



మాట్లాడుతున్న సత్యసాయి ట్రస్ట్ భజన మండలి సభ్యులు

రాయదుర్గం రూరల్: 75 వసంతాల భారతావనిలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆజాదీకా అమృత్ మహోత్సవం ఎంతో వైభవాన్ని సంతరించుకుందని ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి నారాయణ అన్నారు. మండలంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన ఆధ్వర్యంలో సోమవారం నా మట్టి.. నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం వలంటీర్లు సేకరించిన పవిత్ర మట్టి కలశాలు, రావిచెట్టును సత్యసాయి ట్రస్ట్ సభ్యులకు అందజేశారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అందజేసిన మట్టిని వేసి స్థానిక మద్దానేశ్వర స్వామి ఆలయం వద్ద ఆలయకమిటీ అధ్యక్షుడు బసవరాజుతో రావిమొక్కను నాటించారు. సత్యసాయి ట్రస్ట్ భజన మండలి సభ్యులు తిమ్మప్పగుప్తా, గౌని మంజునాథ, ఆర్ రాధాకృష్ణ,అధ్యాపకులు రఘు, పాండురంగ, ప్రశాంత్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే



సమావేశానికి వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు



ఉరవకొండ పట్టణ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

- పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయండి
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఉరవకొండ పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపంలో సోమవారం ఉరవకొండ పట్టణం, రూరల్ పార్టీ శ్రేణులతో వేర్వేరుగా విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు నిర్వహించిన ఉరవకొండ పట్టణ విస్తృతస్థాయి సమావేశానికి వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన పార్టీ రూరల్ విస్తృత స్థాయి సమావేశానికి కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్ అధ్యక్షత వహించారు.

ఉరవకొండ పట్టణంలో రూ.102.63 కోట్ల లబ్ధి

మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ఒక్క ఉరవకొండ పట్టణంలోని ఐదు సచివాలయల పరిధిలో 21,741 మంది లబ్ధిదారులకు రూ.102.63 కోట్ల లబ్ధి చేకురిందన్నారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 27 వరకూ 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహిస్తాన్నారు. పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలు ఎంత మేర లబ్ధి పొందారో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

పత్తాలేని పయ్యావుల కేశవ్

ఉరవకొండ ఎమ్మెల్యేగా గెలిచి నాలుగున్నర సంవత్సరాలైనా నియోజకవర్గానికి ఎప్పుడో ఓసారి చుట్టపు చూపుగా వచ్చి పోతున్న వ్యక్తి కేశవ్ అని ఎద్దేవా చేశారు. వాళ్ల నాయకుడు చంద్రబాబును అరెస్టు చేస్తే ఒక్క ఆందోళన కార్యక్రమంలో కూడా పాల్గొనలేదని విమర్శించారు. ప్రజలను ఏమాత్రం పట్టించుకోకుండా కేవలం విజయవాడ, హైదరాబాద్‌కే పరిమితమైన కేశవ్‌ను ఈసారి చిత్తుగా ఓడించాలన్నారు. అనంతరం ఉరవకొండ పట్టణ, మండల పార్టీ నూతన కమిటీలు, అనుబంధ సంఘాల కమిటీ అధ్యక్షులను మాజీ ఎమ్మెల్యే ప్రకటించారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, కురుబ, ఎంబీసీ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, రమణ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, పార్టీ రూరల్ అధ్యక్షుడు సుంకన్న, మండల సమన్వయకర్త ఓబన్న, వైస్ ఎంపీపీ నరసింహులు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, జేసీఎస్ కన్వీనర్లు తేజోనాథ్, ఆసీఫ్, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, చేనేత నాయకుడు నేసే కోదండరామ్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పార్టీ జిల్లా నాయకుడు సింగాడి తిప్పయ్య, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరంబాషా, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, ముండసు ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'కు స్పందన



గెనిగెరలో వైద్యపరీక్షలు చేయించుకొంటున్న ప్రజలు

కణేకల్లు: మండలంలోని గెనిగెర గ్రామంలో సోమవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ విజయ్‌కుమార్ నాయక్, చంద్రమనోహర్, సంధ్యలు 406 మందికి వైద్య పరీక్షలు చేసి మెడికల్ రిపోర్ట్‌తోపాటు కిట్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హెచ్.సంధ్య, ఈఓపీఆర్‌డీ గూడెన్న, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, సర్పంచు భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల వారీగా వైద్య శిబిరాలు

రాయదుర్గంటౌన్: సచివాలయాల వారీగా హెల్త్ క్యాంపు షెడ్యూల్‌ను మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి సోమవారం విడుదల చేశారు. మంగళవారం పట్టణంలోని ఫైర్‌స్టేషన్‌కు వెళ్లే దారిలోని అభ్యుదయ స్కూల్‌లో 13వ సచివాలయం పరిధిలోని 22, 25 వార్డుల్లో సర్వే చేసి టోకన్లు అందజేసిన వారికి హెల్త్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. నవంబర్ 4 వరకూ వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు హాజరై జయప్రదం చేయాలన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కూడేరు: మండలంలోని కరుట్లపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా, డాక్టర్ సరిత సోమవారం తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు .

నేడు వజ్రహొన్నూరులో..

రాయదుర్గం రూరల్: మండలంలోని వజ్రహొన్నూరులో మంగళవారం ఉదయం 9.30 గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండయ్య సోమవారం తెలిపారు. ప్రతినిధులతో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాభివృద్ధి



శ్రీధరఘట్టలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ పద్మ, పార్టీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి వారు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గౌరమ్మ కాలనీలో రూ.11 లక్షలు, ఎస్సీ కాలనీలో రూ.8 లక్షలతో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి చొరవతో శ్రీధరఘట్ట గ్రామం అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలంతా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారన్నారు. గత టీడీడీ హయాంలో గ్రామంలోని రహదారులు గుంతలమయంగా ఉండేవన్నారు. వైఎస్సార్ ప్రభుత్వంలో కాలనీ రోడ్లకు మహర్దశ ఏర్పడింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్‌రెడ్డి, అప్పని, బోయ గంగన్న, బోయ పక్కీరప్ప, హరిజన వన్నూరుస్వామి, హరిజన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భరోసా 'వైఎస్సార్ బీమా'

రాయదుర్గంటౌన్: వైఎస్సార్ బీమా పథకం పేదలకు బాసటగా నిలుస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అన్నారు. పట్టణంలోని 5వ వార్డులో బోయ మహేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల తక్షణ ఆర్థికసాయాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషాతో కలసి ఆమె అందజేశారు. బీమా కింద మిగతా రూ.90 వేలు నామినీ ఖాతాకు త్వరలో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, గౌని శ్రీరామిరెడ్డి, భీమనపల్లి దివాకర్, రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.





రాయదుర్గంటౌన్: గౌరీదేవి అలంకరణలో వాసవీమాత, గాయత్రిదేవిగా చౌడేశ్వరి మాత



కళ్యాణదుర్గం: వైష్ణవీదేవి అలంకరణలో అమ్మవారు



ఉరవకొండ: గాయత్రి అలంకరణలో ఉరగాద్రి చౌడేశ్వరీ అమ్మవారు



కణేకల్లు: గాయత్రిదేవిగా అమ్మవారు



వజ్రకరూరు: గాయత్రి దేవిగా మారెమ్మ



విడపనకల్లు: శాకంబరిదేవిగా దుర్గాదేవి



కుందుర్పి: అలంకరణలో నాగేపల్లి యల్లమ్మ

దుర్గమ్మా నమోస్తుతే..

సాక్షి నెట్‌వర్క్: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా రెండో రోజు సోమవారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే భక్తులు ఆలయాలకు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

కూడేరు/బెళుగుప్ప: కూడేరులోని ఎస్సీ కమ్యూనిటి హాల్ ఆవరణలో మంగళవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. అలాగే ఇటీవల ఎన్నికైన మండల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎంపీ రంగయ్య, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసులు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి హాజరవుతారన్నారు. అలాగే బెళుగుప్ప మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉరవకొండ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సహకార సంఘాల అధ్యక్షులు, సొసైటీల బోర్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నివాళి

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుదేవనహళ్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిజన తిప్పయ్య భార్య హరిజన రేణుకమ్మ గుండెపోటుతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ పద్మ, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్, పార్టీ మండల కన్వీనర్ రామాంజినేయులు, మాజీ కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్‌లు పరమేశ్వర, కృష్ణ, వన్నూరుస్వామి, దర్గన్న తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆర్థిక సాయం అందజేత

కుందుర్పి: బ్లాక్ ఫంగస్‌తో రెండేళ్లుగా మంచానికే పరిమితమైన ఎనుములదొడ్డికి చెందిన బోయ మహదేవ్‌కు సోమవారం ములకలేడుకు చెందిన టీచర్ రామకృష్ణ రూ.12వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయనకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రాప్ ధ్వంసంపై ఫిర్యాదు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు హెచ్చెల్సీ సెక్షన్ పరిధిలోని 9వ బ్రాంచ్ హెచ్చెల్సీ కాలువలో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. సాగునీటి విషయంలో గోవిందవాడ, కల్లుహోళ, తారకాపురం, బొల్లనగుడ్డం గ్రామాల రైతుల మధ్య గొడవల నేపథ్యంలో రెండు రోజుల క్రితం డ్రాప్‌ను ధ్వంసం చేశారు. కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ డీఈ మద్దిలేటి , జేఈ అల్తాఫ్‌లు పరిశీలించి డ్రాప్‌ను ధ్వంసం చేసిన 25 మంది రైతులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆంధ్ర సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,720 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతున్నట్లు డీఈ తెలిపారు. 1,800 క్యూసెక్కుల ఇండెంట్ ఇవ్వాలని బోర్డు అధికారులను కోరామన్నారు.

పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఏపీకి మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలో ఇంటింటా వివరించండి
- విప్ కాపు రామచంద్రారెడ్డికి దిశా నిర్దేశం చేసిన ప్రభుత్వ సలహాదారు సజ్జల



సజ్జల రామకృష్ణారెడ్డిని కలసిన విప్ కాపు దంపతులు

రాయదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల అమల్లోకి తీసుకొచ్చిన నాలుగు భారీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని విప్ కాపు రామచంద్రారెడ్డికి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకత్వం భాగస్వామ్యమై ముందుకు నడిపించే బాధ్యత చేపట్టాలని వివరించారు. సోమవారం విజయవాడలోని సజ్జల నివాసంలో ఆయనను విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు, నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమంపై వివరించారు. ఈ సందర్భంగా వారి మధ్య సాగిన చర్చను విప్ కాపు 'సాక్షి'కి తెలిపారు. ఏపీకి మళ్లీ జగనే ఎందుకు సీఎం కావాలో ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. గ్రామస్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యంపై శ్రేణుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. గడిచిన నాలుగున్నరేళ్ల సీఎం జగన్ పాలనలో జరిగిన మంచిని ప్రజలకు తెలియజేయాలన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. 2014లో చంద్రబాబు 610 తప్పుడు హామీలిచ్చి మోసం చేసిన విషయంపై ప్రజల వద్ద చర్చించాలన్నారు. ఎవరి హయాంలో ఎంత మేలు, లబ్ధి చేకూరిందో అడిగి తెలుసుకోవాలన్నారు. పెత్తందార్లపై గెలవాలంటే పేదలంతా ఏకం కావాలనే విషయం గడప గడపకూ వెళ్లి వివరించాలన్నారు. 2024లో జరిగే ఎన్నికలు చరిత్రాత్మకమని, 175కు 175 స్థానాల్లో గెలవడమే మన నాయకుడి లక్ష్యమని గుర్తుచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు అవినీతి, అక్రమాలు, మోసాల పై వివరించాలన్నారు.

టీటీడీ నిధులకు టెండర్లు పిలవండి

పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణుడి ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకోసం టీటీడీ ద్వారా రూ. 2.65 కోట్లు, దేవదాయశాఖ ద్వారా రూ.1.50 కోట్లు ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ నిధులకు సకాలంలో టెండర్లు పిలిచి పనులు వేగవంతం చేసేలా కృషి చేయాలని దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఆయన సతీమణి కాపు భారతి విజ్ఞప్తిచేశారు. సోమవారం విజయవాడలోని కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రం అందజేశారు. అలాగే రాయదుర్గం మండలం 74 ఉడేగోళం వద్ద ప్రసిద్ధి చెందిన శివాలయం అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారని విప్ వివరించారు.

బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు



రాయదుర్గం: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ



కంబదూరు మండలం పి.చెర్లోపల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ వనజ అక్కమ్మ



కళ్యాణదుర్గం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్/రాయదుర్గం రూరల్/గుమ్మఘట్ట/కళ్యాణదుర్గం/బ్రహ్మసముద్రం/కంబదూరు: బాల్య వివాహాలు వద్దు..చదువే ముద్దు అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ సూచించారు. రాయదుర్గం పట్టణంలోని 29వ వార్డులోని సరస్వతీ బస్తీ అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల వల్ల అనే దుష్పరిణామాలు కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా హాజరైన అమ్మాయిల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రోజా, రామసుబ్బులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని దుర్గాదేవి మండల సమాఖ్యలో వైకేపీ ఏరియా కో ఆర్డినేటర్ గంగాధర బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎంలు , సమాఖ్య సభ్యులు , ఈసీ సభ్యులు హాజరయ్యారు. గుమ్మఘట్ట మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీ మహిళా మండలి సమైఖ్య కేంద్రం ఆధ్వర్యంలో బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, ఏపీఎం కళానాయక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, వీఓ లీడర్లు , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గంలో ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులతో ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రామ్మూర్తి, స్త్రీనిధి మేనేజర్ రంగనాథ్, అకౌంటెంట్ హనుమంతరాయుడు, మానస మండల సమాఖ్య అధ్యక్షురాలు వనూరక్క, కార్యదర్శి రాధమ్మ, సీసీలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం లీలామణ, ఎంఈఓ ఓబుళపతి , వెలుగు సీసీలు, ఆనిమేటర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కంబదూరు మండలంలోని పి.చెర్లోపల్లి లో ఆర్డీటీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ వనజ అక్కమ్మ , ఆర్డీటీ సిబ్బంది ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మజ, జ్యోతి లక్ష్మి, గ్రామ సంక్షేమ సహాయకుడు వన్నూర్‌స్వామి, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి ఇందిర, ఆర్డీటీ సీఓ రామాంజనేయులు, ఉపాధ్యాయుడు వన్నూర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్పు పరికరాలు, ట్రాక్టర్‌కు నిప్పు

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురంలో సోమవారం రైతులు రాఘవయ్య, శ్రీనివాసులు, నర్సప్పకు చెందిన ట్రాక్టర్, స్ప్రేర్ మిషన్, డ్రిప్ పైపులకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయాయి. అలాగే డ్రిప్ పైపులకు ఏర్పాటు చేసిన గేట్‌వాల్స్ ధ్వంసం చేశారు. ఉదయం రైతులు పొలాలకు వెళ్లడంతో ఈ ఘటన వెలుగుచూసింది. ఉరవకొండ సీఐ ప్రవీణ్‌కుమార్, వజ్రకరూరు ఏఎస్ఐ వెంకటనారాయణ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తూ గుమ్మఘట్ట మండలంలోని నేత్రపల్లి, గోనబావి గ్రామాలకు చెందిన కొండప్ప, మచ్చేంద్ర సోమవారం పట్టుబడ్డారని సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద 90 టెట్రా పాకెట్లు లభించాయన్నారు. కర్ణాటక మద్యం విక్రయించినా, రవాణా చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ షఫీ, సోమశేఖర్, సిబ్బంది శివయ్య, ఇమ్రాన్, తిమ్మన్న, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

రాయదుర్గంటౌన్: రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. బ్రహ్మసముద్రం మండలం గోవిందయ్యదొడ్డికి చెందిన ఆంజనేయులు, తిమ్మక్క దంపతులు రాయదుర్గం పట్టణానికి వచ్చారు. తిరిగి ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళ్తుండగా వేపరాళ్ల క్రాస్ సమీపంలో ఓ ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో ఆంజనేయులు తలకు తీవ్రగాయాలు కాగా తిమ్మక్కకు కాళ్లు చేతులకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు అనంతపురానికి సిఫార్సు చేశారు.

పాఠశాలలకు వంటపాత్రలు, క్రీడా పరికరాలు

బెళుగుప్ప: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ కళాశాలకు గ్రేడులను బట్టి వంటపాత్రలు, విద్యార్థులకు క్రీడా పరికరాల కిట్లు సోమవారం ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్నాయని ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు. ఏ,బీ,సీ,డీ,ఈ,ఎఫ్ చొప్పున గ్రేడ్ల వారిగా మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ కళాశాలకు స్టీల్ వంట పాత్రలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. అలాగే విద్యార్థుల కోసం క్రీడా పరికరాలు వచ్చాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఉండబండ వీరభద్రస్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాకే రమేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారులు ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తుతో పాటు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రెండు పాస్ ఫోటోలను నవంబర్ 2 లోపు జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.